క్లుప్తంగా

విద్యార్థులకు రక్త పరీక్షలు



నెల్లూరు (టౌన్): స్థానిక దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్షలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ మోటివేటర్ అజయ్‌బాబు, ఎన్‌సీసీ అధికారి ధనుంజయ, స్కూల్ హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ధనుంజయరావు, చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు (టౌన్): స్థానిక దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఈగ లహరి ఇల్లు షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. మొత్తం రూ.18 వేలను గురువారం విద్యార్థి తల్లిదండ్రులు నాగవేణి, శేఖర్‌లకు పాఠశాలలో అందజేశారు. దీంతో పాటు ఉపాధ్యాయుడు గోవిందు టీవీ, టేబుల్ ఫ్యాన్ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఇంతియాజ్, ఎంఈఓ–2 అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



నెల్లూరు సిటీ: బీవీనగర్‌లోని కృష్ణమందిరం సమీపంలో పీపుల్ ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి చేతివృత్తుల్లో శిక్షణ పొందిన వారికి స్వర్ణ టోల్‌వే జీఎం హరి పాండురంగ, ఫౌండేషన్ ప్రాజెక్ట్ హెడ్ సానా సురేష్‌రెడ్డిలు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

అన్నదానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పెద్దాస్పత్రిలో ఉన్న శ్రీసత్యసాయి సేవా ట్రస్టులో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైస్ ప్రెసిడెంట్ స్వర్ణ రమేష్‌బాబు తండ్రి నరసారావు వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, నేతలు డీవీ సుబ్బరాజు, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐడీఎస్‌ఓ నేతల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ సాలుచింతలు సెంటర్‌లో ఏఐడీఎస్‌ఓ నేతలు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సురేష్ మాట్లాడుతూ విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐడీఎస్‌ఓ నగరాధ్యక్షుడు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక కూడిక



నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్టు చర్చి డానీహాల్లో నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ (ఎన్‌పీఏ) రెండో వార్షికోత్సవ కూడిక గురువారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ డేవిడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రైల్వేఫీడర్స్‌రోడ్డులోని లోన్‌స్టార్ చర్చి సంఘ కాపరి పాస్టర్ ఐఎస్ బెన్హర్‌బాబు విచ్చేసి వాక్యోపదేశం ఇచ్చారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్, ఎన్‌పీఏ నాయకులు రాజశేఖర్‌దాసరి, డేవిడ్ దయాసాగర్, క్రైస్తవ సంఘం నాయకులు ఉరందూరు సురేంద్రబాబు, రాయపాటి హృదయ్‌కుమార్, బర్నబాస్, రాఘవ మోసెస్, ఆళ్ల ప్రభుకుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద చేనేత కళ

• జేసీ కార్తీక్

నెల్లూరు(అర్బన్): భారతదేశ సాంస్కృతిక వారసత్వ సంపద చేనేత కళ అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద మహాత్ముని విగ్రహానికి గురువారం జేసీతో పాటు ఇతర జిల్లా అధికారులు, చేనేత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే రాట్నం వడకడం, నూలు తీయడం లాంటి నమూనా ప్రదర్శనలతో నేతన్నలు ఆకట్టుకున్నారు. అనంతరం ట్రంకురోడ్డులో నేతన్నలు నిర్వహించిన ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించి, మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమంలో చేనేత వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి గాంధీ ఎంతో కృషి చేశారన్నారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా గాంధీ ఖాదీని ఉపయోగించి స్వయం సమృద్ధిని, స్వయం విశ్వాసాన్ని పెంపొందించారన్నారు. సింథటిక్ వస్త్రాల కన్నా చేనేత వస్త్రాలు హుందాకు ప్రతీకగా ఉంటాయని, ఆరోగ్యంగా కూడా ఉంటుందన్నారు. గాంధీ స్ఫూర్తితో వారంలో ఒక్కరోజు చేనేత వస్త్రాలను ధరించి ఆ రంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్, చేనేత కార్మిక సంఘాల నాయకులు బాలాజీ, వెంకటశేషయ్య, వెంకటసురేష్, శంకరయ్య, సోమా గోపాల్, కోటేశ్వరరావు, అనూరాధ, నేత సంఘాలు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నమూనా రాట్నం వడుకుతున్న చేనేత మహిళలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ, చేనేత నాయకులు

జీజీహెచ్ ఆవరణలో విశేష పూజలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్) ఆవరణలో ఉన్న నాగార్పమ్మ దేవస్థానంలో తొలి వార్షికోత్సవ వేడుకలను ఆస్పత్రికి చెందిన దేవస్థాన కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. నాగార్పమ్మ దేవస్థానంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహాలను నెలకొల్పి సంవత్సరం పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, హెచ్‌డీఎస్ కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు తదితరులు రోగుల సహాయకులతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అనధికార నిర్మాణాల తొలగింపు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటరామాపురం, జేమ్స్‌గార్డెన్ ప్రాంతంలో అనధికార నిర్మాణాల తొలగింపు ప్రక్రియను రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ ప్రక్రియను కమిషనర్ నందన్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, టీపీఓ సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాధానం చెప్పలేక దూప్‌షాట్లు

• రూప్‌కుమార్‌పై వైఎస్సార్‌సీపీ యువ నేతల ధ్వజం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వీఆర్ హైస్కూల్‌పై వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక టీడీపీ నేత రూప్‌కుమార్ దూప్‌షాట్లు వేశారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, నాలుగో డివిజన్ ఇన్‌చార్జి సంధానిలు ధ్వజమెత్తారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్ల ప్రక్రియపై రూప్‌కుమార్ ఒక్కటి కూడా సరైన సమాధానం చెప్పలేదన్నారు. కేవలం పేద పిల్లలకే సీట్లు ఇచ్చారని చెప్పడం పూర్తి అవాస్తవమన్నారు. ఆ స్కూల్లో పిల్లలకు ఇచ్చిన పుస్తకాలపై వెంకటగిరి రాజా, ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల చరిత్ర రాయకుండా నారాయణ స్కూల్ ప్రకటనలు వేయడం, అది సరైనదేనని రూప్‌కుమార్ చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. స్కూల్ బస్సులకు రూ.5 కోట్లు, స్నాక్స్‌కు రూ.5 కోట్లు మున్సిపాలిటీ నుంచి డ్రా చేసుకుని అప్పనంగా నారాయణ దోచుకుంటే సమాధానం చెప్పలేకపోయారన్నారు. నాలుగో డివిజన్ పరిధిలోనే అనేక టీడీపీ కార్యకర్తల పిల్లలకు సీట్లు ఇచ్చి పేదలకు సీట్లు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వాన్ని చూసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గ అబ్జర్వర్‌గా, నెల్లూరు సిటీ ఇన్‌చార్జిగా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, టీచర్స్ విభాగం అధ్యక్షుడిగా ఇలా ఎన్నో పదవులు అప్పగించారన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువ నేతలు

ఎన్జీఓ ప్రతినిధులూ.. దత్తత తీసుకోండి



హాజరైన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): సమాజంలో ధనిక, పేదరికం అనే అంతరాలు తగ్గించేందుకు ఎన్జీఓ సంస్థల(స్వచ్ఛంద సంస్థలు) యాజమాన్యాలు ముందుకొచ్చి పీ4లో భాగంగా నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పీ4 కార్యక్రమంపై ఎన్జీఓలతో గురువారం సాయంత్రం కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించి, మాట్లాడారు. పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో వివిధ రకాల సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషిస్తున్న స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ ఆశయ సాధనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఓ నరసింహారావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు తొలి టీకా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సెక్టార్‌లోని వైకుంఠపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ పాల్గొని, మాట్లాడుతూ, బిడ్డపుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు ఇవ్వాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు తొలి వ్యాధి నిరోధక టీకాలా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీప్రసన్న, భాగ్యమ్మ, రమణమ్మ, మమత, రాధమ్మ, చెంచులు, హసీనా, హెల్త్ సూపర్‌వైజర్లు కరుణ, శీనమ్మ, కల్యాణి, శాంతి, మహిళా పోలీస్ లలితమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సమావేశం



నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలో తాగునీటి సమస్యపై ఎన్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్ నందన్ గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పద్మావతి సెంటర్‌కు చెందిన రవిప్రసాద్ తడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఆయన రైలులో తడకు వెళ్లి వచ్చేవారు. ఈనెల 3వ తేదీ సాయంత్రం ఆయన వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో రైలు దిగారు. పార్కింగ్‌లో ఉన్న బైక్‌లో మెజర్‌మెంట్ బుక్స్ పెట్టుకుని ఇంటికి బయలుదేరారు. గాంధీనగర్ రోడ్డులో ఓ దుకాణం ముందు బైక్‌ను నిలిపి పక్కనే ఉన్న మరో దుకాణం వద్దకు వెళ్లి వచ్చేలోపు బైక్ చోరీకి గురైంది. ఈమేరకు బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

నెల్లూరురూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 13న నెల్లూరు నగరానికి వస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

శంకరమఠంలో చండీహోమం రేపు

నెల్లూరు(బృందావనం): శ్రావణ పూర్ణిమ సందర్భంగా మూలాపేట శంకరమఠంలో శనివారం ఉదయం 8 గంటలకు చండీహోమం జరుగనుందని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్– ఉషాకుమారి దంపతులు గురువారం తెలిపారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో చండీహోమం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేక మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): ఏసీనగర్ కోదండరామాపురంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు వార్షిక మహాకుంభాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పత్తి నరసింహం గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం గో పూజ, గణపతిపూజ, అమ్మవారికి అభిషేకం, వరలక్ష్మి వ్రతం, సామూహిక కుంకుమార్చన సాయంత్రం 4 గంటలకు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానం నుంచి కోదండరామాపురంలోని మహాలక్ష్మి దేవస్థానం వరకు బోనాల ఉత్సవం వేడుకగా జరుగనుందన్నారు. ఇలా శనివారం, ఆదివారం కూడా విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

బీటీఏ సభ్యత్వ నమోదు



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నారాయణరెడ్డి, కోడూరుపాడు, కొత్త కాలువ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బీటీఏ సభ్యత నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని అమలు చేయాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, ప్రసాద్, రాజశేఖర్, సుజాత, రాంబాబు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): హాస్టల్ నుంచి ఇంటికి బయలుదేరిన యువతి అదృశ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు.. బోగోలు మండలానికి చెందిన ఓ యువతి నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 6వ తేదీన ఆమె దుస్తులు తీసుకుని ఇంటికి వెళ్తున్నానని చెప్పి హాస్టల్ నుంచి బయలుదేరింది. ఈ విషయాన్ని హాస్టల్ సిబ్బంది యువతి తల్లికి ఫోన్‌చేసి చెప్పారు. తల్లి కుమార్తెకు ఫోన్ చేయగా స్విచాఫ్‌లో ఉంది. కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లి తన బంధువులతో కలిసి నెల్లూరుకు చేరుకుంది. కుమార్తె అదృశ్యంపై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

వంద శాతం అక్షరాస్యత లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహనరావు

నెల్లూరు(పొగతోట): వంద శాతం అక్షరాస్యత లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ సీఈఓ మోహనరావు అధికారులకు సూచించారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో 'ఉల్లాస్' కార్యక్రమంపై ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీఓలు, ఏపీఎంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన గురువారం మాట్లాడారు. శిక్షణలోని కార్యక్రమాలను అవగాహన చేసుకుని మండలస్థాయిలో ఎంపిక చేసిన టీచర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా తరగతులు నిర్వహించాలన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను అక్షరాస్యులుగా తీర్చేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రణాళికలు రూపొందించుకుని చర్యలు చేపట్టాలన్నారు. అడల్ట్ ఎడ్యుకేషన్ ఏడీ మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 1,08,674 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. వారిని మండలాల వారీగా అక్షరాస్యులను చేసేలా దృష్టి సారించాలన్నారు. వారికి వంద గంటలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, మార్చిలో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీఆర్‌డీఏ నాగరాజకుమారి, కార్పొరేషన్ కమిషనర్ నందన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు డిమాండ్



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు సిటీ: విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సర్ చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న భారాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. రూరల్ పరిధిలోని కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్మార్ట్‌మీటర్లను బిగించడం వల్ల ప్రజలపై అధిక భారం పడుతోందన్నారు. ఇప్పటికే ప్రజలపై సర్ చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం వేశారన్నారు. తాజాగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెంచల నరసయ్య, కట్టా సతీష్, కోటేశ్వరరావు, బి.నాగేశ్వర్‌రెడ్డి, ఖలీల్, హమీద్ పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డులో ఆక్రమణలు తొలగించండి

• ముగ్గురు శానిటేషన్ సిబ్బందిపై చర్యలు



కూరగాయల మార్కెట్ ప్రాంగణ సమీపంలో పర్యవేక్షిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరంలోని మద్రాస్ బస్టాండ్ ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ రోడ్డులో ఆక్రమణలు తొలగించి, తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా స్థానిక కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంగణాలను కమిషనర్ గురువారం పరిశీలించారు. మార్కెట్ ప్రాంగణంలో పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాలు, అత్యంత అపరిశుభ్రంగా ఉన్న మార్కెట్ పరిసరాలు, జనావాసాల మధ్యనే తిరుగుతూ, రోడ్లపై సంచరిస్తున్న పశువులను గుర్తించిన కమిషనర్ సంబంధిత ముగ్గురు సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్‌హెచ్‌ఓను ఆదేశించారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న దుకాణదారులను గుర్తించి రూ.5 వేల జరిమానాలు విధించారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు విచ్చేసే కూరగాయల మార్కెట్ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని దుకాణదారులు, మార్కెట్ అసోసియేషన్ నిర్వాహకులను సూచించారు. అనంతరం భగత్‌సింగ్ కాలనీలో హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసేందుకు రూపొందిస్తున్న వేదిక ఏర్పాటు పనులను జేసీ కార్తీక్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనూష, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అర్బన్ తహసీల్దార్ షఫీ మాలిక్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు పాల్గొన్నారు.

'జిందాల్' ప్రతినిధులతో సమావేశం



బ్యాంక్ గ్యారెంటీని అందజేస్తున్న జిందాల్ ప్రతినిధులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా జిందాల్ కంపెనీ ప్రతినిధులు కమిషనర్ నందన్‌ను ఆయన చాంబర్‌లో గురువారం కలిసి సమావేశమయ్యారు. దొంతాలి ప్రాంతం వద్ద 12 మెగావాట్లతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.6 కోట్లకు బ్యాంక్ గ్యారెంటీని కమిషనర్‌కు కంపెనీ ప్రతినిధులు అందజేశారు. జిందాల్ కంపెనీ గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 20 మెగావాట్లు, విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో 15 మెగావాట్ల ప్లాంట్లను స్థాపించి, చెత్త నుంచి కరెంటును విజయవంతంగా ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ ఆపరేషనల్ ప్రెసిడెంట్ ఎమ్వీ చారి, బృంద సభ్యులు కమిషనర్‌కు వివరించారు. నగరపాలక సంస్థ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఓఎస్డీ టెక్నికల్ ఖాజావలీ, ఈఈ రహంతు జానీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

నెల్లూరు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో డాక్టర్ కిశోర్స్ రత్నం విద్యార్థులు ప్రతిభ చాటినట్లు స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక రత్నం స్కూల్‌లో విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల విభాగం రికర్వ్ రౌండ్ కేటగిరీలో పి.భావజ్ఞహంసిని ప్రథమ, కాంపౌండ్ రౌండ్ కేటగిరీలో కె.జననీ ప్రథమ, ఇండియన్ రౌండ్ కేటగిరీలో కె.మోక్ష తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. వీరు ఈనెల 11, 14వ తేదీలో గుంటూరులో జరిగే జోనల్ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఈనెల 24న అందజేయనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కామేశ్వరప్రసాద్, టి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అందుకు సంబంధించి విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, పదో తరగతి మార్కుల పత్రం, బయోడేటాను ఈనెల 20వ తేదీలోగా అందజేయాలన్నారు. బాలాజీనగర్‌లోని కురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో 24వ తేదీ సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం టి.శ్రీనివాసరావు 88851 52378, సి.సత్యనారాయణ 94412 08958 నంబర్లను సంప్రదించాలన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక శాఖ నూతన డీజీగా బాధ్యతలు స్వీకరించిన పి.వెంకటరమణను ఆశాఖ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నెల్లూరుకు చెందిన కె.చంద్రశేఖర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీజీ మాట్లాడుతూ ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.